పెరగని ధరలు.. నష్టాల్లో రైతులు

- పట్టుగూళ్ల ధరలపై అన్నదాతల అసంతృప్తి
- పెరిగిన పెట్టుబడి వ్యయం.. తగ్గిన ఆదాయం


రేషం షెడ్‌లో పట్టు పురుగుల పెంపకం దృశ్యం

మడకశిర: పట్టుగూళ్ల ధరలపై రైతులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. గత రెండేళ్ల నుంచి ఆశించిన స్థాయిలో పట్టుగూళ్ల ధరలు పెరగడం లేదు. ఇటీవల పట్టుగూళ్ల ఉత్పత్తి వ్యయం భారీగా ఉంటోంది. దీంతో ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న పట్టుగూళ్ళ ధరలు ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదని పట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కిలో బైవోల్టిన్ పట్టుగూళ్ల కనిష్ట ధర రూ.430 దాటడం లేదు. కనిష్ట ధర రూ.350 నుంచి రూ.420 లోపే ఉంటోంది. అలాగే కిలో బైవోల్టిన్ పట్టుగూళ్ల గరిష్ట ధర రూ.575 లోపు ఉంటోంది.గత రెండేళ్లలో గరిష్ట ధర రూ.600 దాట లేదని రైతులు అంటున్నారు. గతంలో పట్టుగూళ్ల ధరలు గరిష్టంగా రూ.650, కనిష్టంగా రూ.550 వరకూ ఉండడంతో రైతులకు గిట్టుబాటయ్యేది.

పెరిగిన పట్టుగూళ్ల ఉత్పత్తి వ్యయం

గతంలో కంటే ప్రస్తుతం పట్టుగూళ్ళ ఉత్పత్తి వ్యయం పెరిగింది. దీంతో పట్టు రైతులకు గతంలో కంటే ప్రస్తుతం ఆదాయం తగ్గింది. ముఖ్యంగా పట్టు పురుగుల పెంపకానికి మల్బరీ తోటలను పెంచడం ఖర్చుతో కూడుకున్న పని. రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు పట్టు పురుగుల పెంపకానికి కొన్ని ప్రోత్సాహకాలు అందించినా ...అవి రైతులకు ఏమాత్రం సరి పోవడం లేదు. మల్బరీ తోటలను పెంచడానికి అవసరమైన కూలీల ఖర్చులు విపరీతంగా పెరిగాయి.అదే విధంగా రసాయన ఎరువులు, పశువుల ఎరువుల ధరలు కూడా పెరిగాయి. పట్టు పురుగుల పెంపకానికి రేరింగ్ షెడ్లు అవసరం .ప్రభుత్వం ఈషెడ్ల నిర్మాణానికి ఆశించిన స్థాయిలో సబ్సిడీ ఇవ్వడం లేదు. దీంతో రైతులు అప్పులు చేసి రేరింగ్ షెడ్లను నిర్మించుకోవాల్సి ఉంటుంది. ఇలా పెట్టుబడి భారీగా పెరగడంతో ప్రస్తుతం ఉన్న ధరలు గిట్టుబాటు కావడం లేదని రైతుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం బైవోల్టిన్ రైతులకు కిలోకు రూ.10 ప్రోత్సాహక ధనం సక్రమంగా అందించడం లేదని రైతులు వాపోతున్నారు

మడకశిరలో పట్టుపరిశ్రమే ఆధారం

మడకశిర నియోజకవర్గం పట్టుపురుగుల పెంపకానికి పెట్టింది పేరు. నియోజకవర్గవ్యాప్తంగా ఒక కుటీర పరిశ్రమ తరహాలో పట్టు పురుగుల పెంపకం కొనసాగుతోంది.దాదాపు 60 శాతం మంది రైతులు పట్టు పురుగుల పెంపకాన్ని చేపట్టారు. దాదాపు 10 వేల ఎకరాల్లో మల్బరీ తోటల విస్తీర్ణం ఉంది. రూ.15 వేల కుటుంబాలు పట్టుపరిశ్రమపై ఆధార పడి జీవిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిలో పట్టుగూళ్ళ ధరలు ఆశించిన స్థాయిలో లేక పోవడం రైతులకు శాపంగా మారింది.

హిందూపురం మార్కెట్‌లో గత వారం రోజుల నుంచి పట్టుగూళ్ల ధరలు ఇలా....

తేదీ	కనిష్ట ధర (కేజీ)	గరిష్ట(కేజీ) ధర
జూన్ 22	రూ.322	రూ.580
జూన్ 23	రూ.411	రూ.583
జూన్ 24	రూ.380	రూ.582
జూన్ 25	రూ.420	రూ.566
జూన్ 26	రూ.391	రూ.585
జూన్ 27	రూ.400	రూ.576
జూన్ 28	రూ.361	రూ.565
జూన్ 29	రూ.385	రూ.566

ధరలు ఆశించిన స్థాయిలో లేవు



పట్టుగూళ్ల ధరలు ఆశించిన స్థాయిలో లేవు. కనిష్ట ధర రూ.300 నుంచి ప్రారంభమవుతుంది. ఎక్కువ మంది రైతులకు కిలో రూ.400 లోపే ధర లభిస్తుంది.కొద్ది మంది రైతులకు మాత్రమే ధర రూ.500 వరకూ లభిస్తుంది. పట్టు రైతులకు ఈ ధరలు ఏమాత్రం గిట్టుబాటు కాదు. ఖర్చులు పెరిగినా ధరలు పెరగడంలేదు. దీంతో నష్ట పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం కిలోకు రూ.600 ధర లభించేలా చర్యలు తీసుకోవాలి.

- సన్నమారప్ప, కొత్తపాళ్యం,రొళ్ల మండలం

ప్రోత్సాహకాలు అందించాలి



బైవోల్టిన్ పట్టు రైతులకిచ్చే ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం వెంటనే అందించాలి. పూర్తి స్థాయిలో బకాయిలను చెల్లించి రైతులను ఆదుకోవాలి.రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాన్ని చెల్లించడంలో జాప్యం చేయకుండా చొరవ తీసుకోవాలి. రూ.కోట్లల్లో బకాయిలు ఉన్నాయి. ఈబకాయిలను చెల్లిస్తే పట్టు రైతులకు కొంత వరకు ఊరట లభిస్తుంది.రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించడంలో నిర్లక్ష్యం చూపకుండా రైతులను ఆదుకోవాలి.

-కెంచప్ప, మద్దనకుంట, అమరాపురం మండలం

క్లుప్తంగా

గుంతలు తవ్వారు.. పైపులు మరిచారు


తాగు నీటి సరఫరా కోసం తవ్విన గుంతలు

పావగడ: తుంగభద్ర తాగునీటి యోజన కింద గ్రామాల్లో ప్రతి ఇంటికీ తాగు నీరందించే ప్రక్రియ లో భాగంగా వెంకటమ్మనహళ్ళి గ్రామం ప్రధాన రహదారుల్లో పైపులు పూడ్చడానికి గుంతలు తవ్వడంతో బస్సులు తదిర వాహనాల రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు వాపోయారు. సుమారు నాలుగు నెలల క్రితం అధికారులు వచ్చి గుంతలు తవ్వడానికి హడావుడి చేశారని, ఆ తర్వాత గ్రామం వైపు కన్నెత్తి చూడలేదన్నారు. ప్రధాన రహదారుల్లో గుంతలు తవ్వి అలాగే వదిలేసి వెళ్లే ఇక్కడి ప్రజల పరిస్థితి ఏం కావాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు చొరవ చూపి గుంతల్లో పైపులు పూడ్చి వాహనాల రాకపోకలకు సుగమం చేయాలని కోరారు.

నేడు మంత్రి పర్యటన

సోమందేపల్లి: మండల కేంద్రంలోని స్నేహలత నగర్‌లో పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళీశాఖ మంత్రి సవిత హాజరుకానున్నారు. ఉదయం 7 గంటలకు లబ్ధిదారులతో పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు మంత్రి కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి.

ఎండిన చెట్టును తొలగించండి


ఎల్లోటి క్రాస్ వద్ద చెట్టు

మడకశిరరూరల్: మండలంలోని తడకలపల్లి సమీపంలోని ఎల్లోటి క్రాస్‌లో రోడ్డు పక్కన ఎండి పోయిన నేరేడు చెట్టును తొలగించి ప్రమాదం జరుగకుండా చూడాలని స్థానికులు కోరారు. హిందూపురం, మడకశిర వెళ్లడానికి బస్సు కోసం ఎల్లోటి క్రాస్‌కు వెళ్తుంటామని, ఎండిన చెట్టు కొమ్మలు మీద పడుతాయని అక్కడ నిలబడలేకపోతున్నామని ఎల్లోటి గ్రామస్తులు తెలిపారు. వర్షా కాలం కావడంతో కొద్దిగా ఈదురు గాలుల వీస్తే ఎండిన చెట్టు కొమ్మలు పడి ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. అధికారులు స్పందించి ఎండిన చెట్టును తొలగించి ప్రమాదం జరగకుండా చూడాలన్నారు.

ఇబ్రహీం బాబా ఆశ్రమంలో పూజలు


బాబా విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

సోమందేపల్లి: మండలంలోని చాకర్లపల్లిలో వెలసిన ఇబ్రహీం బాబా ఆశ్రమంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబా ఆరాధనోత్సవాలు సందర్భంగా ఆయన సమాధిపై ప్రత్యేక చాదర్ సమర్పించి, భక్తులు పూజలు చేశారు. ఇబ్రహీం బాబా విగ్రహాన్ని రథంలో సోమందేపల్లి వరకు ఊరేగించారు. రాత్రికి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సోమవారం కూడా పూజా కార్యక్రమాలు ఉంటాయని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు.

కొట్నూరు పోస్ట్‌మాస్టర్ మృతి


రంగనాథ ప్రసాద్ (ఫైల్)

హిందూపురం: మున్సిపల్ పరిధిలోని కొట్నూరు పోస్టుమాస్టర్‌గా పని చేస్తున్న రంగనాథ ప్రసాద్ (57) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. 4 రోజుల క్రితం రంగనాథ ప్రసాద్ తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో బెంగళూరులోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. ఇతడికి భార్య, కుమార్తె ఉన్నారు. హిందూపురంలోని లింకంపల్లిలో సోమవారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు రంగనాథ్ ప్రసాద్ సోదరుడు రవి ప్రసాద్ తెలిపారు.

ఆటో బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

మడకశిరరూరల్: మండలంలోని చంద్రకచర్ల గ్రామం నుంచి గౌడనహళ్లికి వస్తుండగా ఆదివారం సాయంత్రం మార్గ మధ్యంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆ సమయంలో ఆటోలో ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్ రామకృష్ణకు స్వల్ప గాయలయ్యాయి. బంధువులు అతడిని వెంటనే 108 వాహనంలో మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలందించారు.

వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు కృషి


మాట్లాడుతున్న నరసింహ కృష్ణ

పావగడ: పట్టణంలో త్వరలో వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్టాపన చేస్తామని స్థానిక వాల్మీకి సంఘం అధ్యక్షుడు, లాయర్ నరసింహ కృష్ణ తెలిపారు. అతిథి గృహంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాలూకా వ్యాప్తంగా 56 వేలకు పైగా వాల్మీకి జనాభా ఉందని, అయితే వాల్మీకుల్లో ఐక్యత కొరవడి అనేక సమస్యలు ఉత్పన్న మవుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక తుమకూరు రోడ్డులో నిర్మించిన వాల్మీకి భవన్ ఎలాంటి నిర్వహణ లేకుండా పోవండంతో అభివృద్ధికి నోచుకోలేదని ఆరోపించారు. తాలూకా లోని వాల్మీకులందరూ ఒక్క తాటి పై నడిచి వాల్మీకి సమాజం అభివృద్ధి కి కృషి చేద్దామని పిలుపు నిచ్చారు. సంఘం గౌరవ అధ్యక్షుడు నరసింహమూర్తి మాట్లాడుతూ వాల్మీకి సమాజంలో ఆర్థిక, సామాజిక, విద్య రంగాలలో వెనుక బడిన కులస్థులను ఆదుకునే దిశగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పలువురు వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లిలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కమిటీ సభ్యులు ఆదినారాయణ మాట్లాడుతూ పవిత్ర భగవద్గీత సారాంశాన్ని ప్రచార కార్యక్రమంలో హిందువులకు తెలియజేస్తున్నామన్నారు. పురాణాలు, ఇతిహాసాలు ప్రతి హిందువూ తప్పకుండా తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శేఖర్, మునీంద్ర, గణేష్, పెన్నోబులేశు, రవి, భాస్కర్, సుభద్ర, జ్యోతి, లీల, కూనలమ్మ, పార్వతమ్మ, సరస్వతి, మమత, సుమన తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది


రంగప్పను సన్మానిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ శివశంకర్ దంపతులు


వెంకటరమణప్పను సన్మానిస్తున్న ఈరలక్కప్ప


ఎంపీడీఓ మునిస్వామిని సన్మానిస్తున్న దృశ్యం

అమరాపురం: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని అనంతపురం జిల్లా సీనియర్ సివిల్ స్పెషల్ జడ్జి డాక్టర్ కె.శివశంకర్ అన్నారు. ఆదివారం మండలంలోని దేవగానపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎల్‌ఎఫ్ఎల్ హెచ్ఎంగా విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన రంగప్పకు ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి మాట్లాడుతూ పిల్లలు బాధ్యత గల వ్యక్తులుగా మెలగాలంటే ఉపాధ్యాయుని చేతిలో ఉంటుందన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, గ్రామస్తులు, వివిధ పార్టీల నాయకులు, విద్యార్థులు శ్రీరంగప్పను శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

బీట్ ఆఫీసర్‌కు సన్మానం

మడకశిర: నియోజకవర్గంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వెంకటరమణప్ప ఆదివారం పదవీ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో ఆయనకు పెనుకొండలో పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మడకశిర ఇన్‌చార్జ్ ఈరలక్కప్ప పాల్గొన్నారు. ఈ సంరద్భంగా వెంకటరమణప్పను ఘనంగా సన్మానించారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ వెంకటరమణప్పను ఆదర్శంగా తీసుకుని పని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫారెస్టు సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు

అమరాపురం: గ్రామాల్లో ప్రజలకు సేవలు చేయడం ద్వారా గుర్తింపు వస్తుందని ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, తహసీల్దార్ వెంకటసుబ్బయ్య అన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఉద్యోగ విరమణ పొందిన ఎంపీడీఓ మునిస్వామి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఐకేపీ, ఎంపీడీఓ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, ఈఓఆర్డీ నాగముని, ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, వివిధ కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు, ఎంఈఓ వెంకటరమణనాయక్, శ్రీధర్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి


భరతనాట్యం చేస్తున్న కళాకారులు

హిందూపురం: గ్రామీణ ప్రాంత కళాకారులను ప్రోత్సహించి వారిలో నైపుణ్యాలను వెలికితీసేందుకు సద్గురు యోగి నారాయణ సేవా సమితి కృషి చేస్తుందని ఆ సమితి ప్రెసిడెంట్ రవిశంకర్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని కె.వి.ఆర్ ఫంక్షన్ హాల్‌లో బెంగళూరు, తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 20 మంది కళాకారులతో నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. పలువురు కళాకారులు భరతనాట్యం, కూచిపూడి నాట్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ.. ప్రదర్శనలతో కళలను బయటకు వెలికితీయడానికి ఒక్కొక్క గ్రామంలో కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. అంతరించిపోతున్న కళలను పిల్లలకు పరిచయం చేయాలన్నదే ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సుస్మిత అమృత కళాబృందాలు, యోగి నారాయణ సభ్యులు రాయుడు, శ్రీధర్, నాగేంద్ర ప్రసాద్, సజిత్, సరిత, షణ్ముఖ, లక్ష్మి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో రెండు వర్గాల ఘర్షణ

రొద్దం:మండల పరిధిలోని తురకలాపట్నం గ్రామంలో టీడీపీలోని రెండు వర్గాల మధ్య ఆదివారం ఘర్షణ జరిగింది. బోయ, కురుబ సామాజిక వర్గాలు వారు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. దీంతో ఇరువర్గాలకు చెందిన పలువురు గాయపడినట్లు గ్రామస్తులు తెలిపారు. గాయపడిన వారు పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. నాగేంద్ర వర్గంపై హరీష్ అనే వ్యక్తి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఘర్షణపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నేడు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి ఆదివారం తెలిపారు. మండల, గ్రామ స్థాయి అధికారులు కార్యక్రమానికి హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, సత్వరమే పరిష్కరించాలని కోరారు.

పౌరహక్కులపై అవగాహన

లేపాక్షి: మండలంలోని కంచిసముద్రం ఎస్సీ కాలనీలో ఆదివారం సాయంత్రం పౌరహక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గోపి మాట్లాడుతూ.. ప్రజలందరూ రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

అవకతవకలపై తనిఖీ చేయండి


ఆధారాలు చూపిస్తున్న హనుమంతరాయప్ప

పావగడ: రొప్పం గ్రామ పంచాయతీలో 15వ ఫైనాన్స్, వర్గం-1లో భారీ అవినీతి జరిగిందని, వాటికి సంబంధించిన సమాచారం అడిగితే పీడీఓ సరైన సమాధానం ఇవ్వలేదని బొమ్మతనహళ్లి పంచాయతీ సభ్యుడు జీఎన్ హనుమంతరాయప్ప ఆరోపించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 15వ ఫైనాన్స్‌లో 10 నెలల కాలంలోనే రూ. 20 లక్షలు, వర్గం- 1 లో రూ.15 లక్షల నిధులను గ్రామ పరిశుభ్రత పనులు, వీధి నాటకం నిర్వహణ పేరుతో డ్రా చేసుకుని అవకతవతలకు పాల్పడ్డారన్నారు. అంతే కాకుండా లే అవుట్ల అనుమతి కోసం ఖాతాలు దొడ్డి దారిన అందించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వాటిపై దర్యాప్తు జరిపి న్యాయం చేయాలని సంబంధిత అధికారులను ఆయన కోరారు.

ఆలయానికి రూ.2 లక్షల విరాళం


రొద్దకాంబ దేవి ఆలయానికి విరాళం అందిస్తున్న నాగరాజు

రొద్దం: మండల కేంద్రంలోని పెన్నానది ఒడ్డున వెలసిన పురాతన రొద్దకాంబదేవి ఆలయ నిర్మాణానికి బెంగళూరు గట్టిగెరిపాళ్యంకు చెందిన వి.నాగరాజు రూ.2 లక్షలు విరాళం ఇచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు నగదు అందించారు.

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో సిద్ధేశ్వర స్వామి

అమరాపురం: మండలంలోని హేమావతిలో ఉన్న సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఉదయం స్వామికి సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం అర్చకులు భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. ఆదివారం సెలవు కావడంతో మడకశిర నియోజకవర్గం నుంచే కాక సమీప కర్ణాటక ప్రాంతాలైన శిర, హిరియూర్, పావగడ, మధుగిరి, తుమకూరు, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి మొక్కులు చెల్లించారు. భక్తులకు అర్చకులు ప్రసాద వినియోగం చేశారు.

గంగాజలంతో అభిషేకం

రొళ్ల: మండలంలోని టీడీ పల్లి సమీపాన అటవీ ప్రాంతంలో వెలసిన సిద్ధేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకుడు స్వామి మూల ప్రతిమను గంగా జలంతో అభిషేకించారు. అనంతరం వెండి ఆభరణాలతో పాటు పూలతో అలంకరణ చేసి మహామంగళారతి చేశారు. పలువురు భక్తులు ఆలయ ఆవరణలో వంటకాలు చేసి స్వామికి నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

గోరంట్ల: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు మంత్రి గోరంట్లకు రాక: ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ గోరంట్లకు సోమవారం రానున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. పాలసముద్రం గ్రామంలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి సవితమ్మ సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

చిలమత్తూరు: మండలంలోని పింఛన్‌దారులకు సోమవారం నుంచి పింఛన్ సొమ్ము పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ రామ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో 7,698 పింఛన్లు ఉండగా.. ప్రభుత్వం రూ.5,29,58,500 విడుదల చేసిందన్నారు. మండలంలో వివిధ శాఖల్లో పని చేసే 123 మంది సిబ్బందిని పింఛన్ల పంపిణీకి నియమించామని తెలిపారు. ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ పంపిణీ చేస్తారన్నారు.

రొళ్ల: పది పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సచివాలయం ఉద్యోగుల ద్వారా సోమ, మంగళవారం ఇంటింటా పింఛన్ పంపిణీ చేయనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

హిందూపురం: శ్రీసత్యసాయి జిల్లా ఆర్యవైశ్య సంఘం, హిందూపురం ఆర్యవైశ్య అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఆస్టర్ ఆర్‌వీ హాస్పిటల్స్ వైద్యుల సహకారంతో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు.

ప్రముఖ ఎముకల వైద్యుడు జీవీఎస్ శ్రీనివాస్ వైద్య బృందం ఈఎన్‌టి, గైనకాలజీ, కార్డియాలజీ తదితర విభాగాల వైద్యులు సుమారు 430 మందికి వైద్య పరీక్షలు చేశారు. చికిత్సకు సంబంధించి సూచనలు ఇచ్చి మందులు అందించారు. కార్యక్రమంలో సత్యసాయి జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు జేపీకే రాము, కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి రవీంద్రుడు, జి.ప్రకాష్, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.